# మన బిడ్డ మెరిసె

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం




తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జివాంజీ అంతర్జాతీయ వేదికపై మరోమారు అదరగొట్టింది. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల 400మీటర్ల టీ20 రేసులో దీప్తి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. పారాలింపిక్స్‌లో పోటీకి దిగింది తొలిసారే అయినా..ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన దీప్తి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. ఏడో లేన్‌లో పరుగు మొదలుపెట్టిన ఈ వరంగల్ అమ్మాయి..మూడో స్థానంతో రేసును ముగించింది. విశ్వక్రీడా వేదికపై జాతీయ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. అయితే దీప్తి ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఎంతో శ్రమ, కృషి దాగుంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో సామాన్య రైతు కూలీ కుటుంబంలో పుట్టిన దీప్తి..అథ్లెటిక్స్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకమని చెప్పాలి. చిన్నతనంలో తలకు బలమైన గాయం ఆమె విధిరాతని మార్చింది. పొలం గట్లపై జింకను తలపిస్తూ దీప్తి పరిగెత్తే తీరు అందరినీ ఆశ్చర్యపరిచేది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలు ఆమె కెరీర్‌కు ప్రాణం పోశాయి. ప్రత్యర్థులను అవలీలగా దాటేస్తూ లక్ష్యాన్ని చేరుకున్న వైనాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు..ఈ విషయాన్ని ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నఫళంగా కల్లెడ నుంచి హైదరాబాద్‌కు మారిన దీప్తి కెరీర్‌కు రమేశ్ మెరుగులు అద్దారు. తన పరుగుకు ప్రతిభను జోడిస్తూ ఒక్కో మెట్టు ఎదిగిన దీప్తి..తొలుత సాధారణ అథ్లెట్లతో కలిసి పోటీపడింది. అయితే దీప్తికి ఉన్న మేధోపరమైన సమస్యను గుర్తించిన రమేశ్..పారా అథ్లెటిక్స్ వైపు ఆమెను అడుగులు వేయించారు. 2019 ఏషియన్ యూత్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం ద్వారా పారా అథ్లెట్‌గా కెరీర్ మొదలుపెట్టింది. అప్పటి నుంచి ఆమె మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. 2022 ఆసియా పారా గేమ్స్‌లో రికార్డు స్వర్ణం సొంతం చేసుకుంది. అదే జోరు కొనసాగిస్తూ ఈ ఏడాది జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 55.07 టైమింగ్‌తో కొత్త రికార్డు నెలకొల్పింది. పారాలింపిక్స్‌లో కాంస్యంతో దీప్తి పేరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్నది.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 50 | 38 | 20 | 108 |
| 2 | బ్రిటన్ | 30 | 17 | 12 | 59 |
| 3 | అమెరికా | 18 | 23 | 11 | 52 |
| 4 | బ్రెజిల్ | 14 | 10 | 24 | 48 |
| 5 | ఫ్రాన్స్ | 11 | 12 | 15 | 38 |
| 6 | ఇటలీ | 10 | 8 | 16 | 34 |
| 18 | భారత్ | 3 | 5 | 8 | 16 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

# కాంస్య దీప్తి

## పారాలింపిక్స్‌లో తెలంగాణ అమ్మాయికి పతకం

**400 మీటర్ల రేసులో కాంస్యం సొంతం • బ్యాడ్మింటన్‌లో కొనసాగిన పతక జోరు**

**ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత యువ అథ్లెట్ జివాంజీ దీప్తి తళుక్కున మెరిసింది. మహిళల 400మీటర్ల టీ20 రేసులో కాంస్య పతకంతో సత్తాచాటింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఈ తెలంగాణ అమ్మాయి అరంగేట్రం పారాలింపిక్స్‌లో తొలి పతకాన్ని ముద్దాడి ఔరా అనిపించింది. ప్రతిభకు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తూ పరుగులో తనకు తానే సాటి అని నిరూపించుకుంది. కచ్చితంగా పతకం గెలుస్తుందన్న అంచనాలను నిజం చేస్తూ పోటీకి దిగిన ఈ వరంగల్ ముద్దుబిడ్డ భారత ఖ్యాతిని ఇనుమడింపజేసింది. ప్రపంచ రికార్డు పారా అథ్లెట్‌గా పారాలింపిక్స్‌లో బరిలోకి దిగిన దీప్తి మూడో స్థానంతో పోటీని ముగించింది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు కొల్లగొట్టిన దీప్తి..భారత భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నది. రెండు పదుల వయసులోనే కోట్లాది మంది ఆశలకు ప్రతిరూపంగా నిలిచింది. సామాన్య వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చిన దీప్తి కష్టాలకు ఎదురొడ్డుతూ, అవమానాలు భరిస్తూ ఈ స్థాయికి చేరిన వైనం ఎంతో మందికి ప్రేరణ. బ్యాడ్మింటన్‌లో పతక జోరు కొనసాగిస్తూ నిత్యశ్రీ కాంస్యాన్ని ఖాతాలో వేసుకుంది.**



పారిస్: పారాలింపిక్స్‌లో తెలంగాణ అమ్మాయి దీప్తి జివాంజీ కంచు మోత మోగించింది. మహిళల 400 మీటర్ల పరుగు పందెం(టీ20)లో దీప్తి.. 55.82 సెకన్లలో పరుగును పూర్తిచేసి మూడో స్థానాన్ని దక్కించుకుని కాంస్యంతో సత్తా చాటింది. అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం నెగ్గిన ఉక్రెయిన్ అథ్లెట్ షులియర్ యులియ (55.16), రజతం గెలిచిన టర్కీ అమ్మాయి ఒండర్ ఐసెల్ (55.23)కు దీప్తి మధ్య తేడా మిల్లీ సెకన్లే. సోమవారం జరిగిన హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన దీప్తి.. తుది పోరులో తృటిలో బంగారు పతకాన్ని చేజార్చుకున్నా పోడియంపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. రేసు మధ్య వరకూ రెండో స్థానంలో ఉన్న దీప్తి లక్ష్యానికి కొద్దిదూరంలో ఉండగా నెమ్మదించడాన్ని టర్కీ అమ్మాయి సద్వినియోగం చేసుకుంది. ఇక బ్యాడ్మింటన్‌లో మరో షట్లర్ సుమతి శివన్ నిత్య శ్రీ (ఎస్‌హెచ్6) కాంస్య పోరులో గెలిచి భారత్‌కు మరో పతకాన్ని అందించింది.



## అవనికి ఐదో స్థానం

పారాలింపిక్స్‌లో భారత్‌కు పతకాల ఖాతా తెరిచిన యువ షూటర్ అవని లేఖరా మరో పతకాన్ని దక్కించుకునే అవకాశాన్ని తృటిలో కోల్పోయింది. మంగళవారం ముగిసిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఎస్‌హెచ్1లో ఆమె ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 1159 పాయింట్లు స్కోరు చేసి ఫైనల్స్‌కు అర్హత సాధించి అవని.. కీలక పోరులో మాత్రం తడబడింది. ఫైనల్స్‌లో ఆమె 420.6 పాయింట్లు సాధించింది. 456.5 పాయింట్లతో జర్మనీ షూటర్ హిల్‌ట్రాప్ నటాస్చా స్వర్ణం గెలుచుకోగా వెరోనికా (స్లోవేకియా), జంగ్ (చైనా) రజత, కాంస్యాలు నెగ్గారు.

## శభాష్ సుమతి

పారా బ్యాడ్మింటన్‌లో భారత్ పతకాల జోరు కొనసాగుతోంది. సోమవారం ఓ స్వర్ణం, రెండు రజతాలు, మరో కాంస్యంతో దుమ్మురేపిన పారా షట్లర్లు దుమ్మురేపగా సుమతి సైతం అదే బాటలో నడిచింది. మహిళల సింగిల్స్ ఎస్‌హెచ్6 కాంస్య పోరులో సుమతి.. 21-14, 21-6తో మార్లినా రినా (ఇండోనేషియా)ను చిత్తు చేసి ఈ క్రీడలో భారత్‌కు మరో పతకాన్ని చేర్చింది. ఆట ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సుమతికి ప్రత్యర్థి నుంచి మొదటి గేమ్‌లో కాస్త ప్రతిఘటన ఎదురైనా రెండో గేమ్‌లో మాత్రం ఆమె రెచ్చిపోయింది. 13 నిమిషాల్లోనే తొలి గేమ్‌ను ముగించిన సుమతి.. రెండో గేమ్‌ను 10 నిమిషాల్లోనే పూర్తిచేసి కాంస్యాన్ని ముద్దాడింది. హోసూర్‌కు చెందిన 19 ఏండ్ల నిత్య.. 2016 దాకా క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నా ఆ ఏడాదిలో జరిగిన పారాలింపిక్స్ తర్వాత తన దృష్టిని బ్యాడ్మింటన్‌పై నిలిపింది.





# భారత్, మారిషస్ మ్యాచ్ డ్రా

- **ఇంటర్‌కాంటినెంటల్ కప్**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ చాలా రోజుల తర్వాత అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చింది. స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా మంగళవారం ఇంటర్‌కాంటినెంటల్ కప్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్ ఎలాంటి గోల్ లేకుండా డ్రాగా ముగిసింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో తమ(124) కంటే 55 ర్యాంక్‌లు తక్కువగా ఉన్న మారిషస్(179)ను భారత్ నిలువరించలేకపోయింది. కోచ్‌గా మనొలో మార్క్వెజ్ తన తొలి మ్యాచ్‌లో బోణీ కొట్టలేకపోయాడు. రౌండ్ రాబిన్‌లో భాగంగా ఈనెల 9న భారత్, సిరియాతో తలపడనుంది. అంతకుముందు ఆతిథ్య భారత్, మారిషస్ జట్ల మధ్య మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి టోర్నీని అధికారికంగా ప్రారంభించి ఇరు జట్ల ప్లేయర్లతో కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ బౌచే, మంత్రి పొన్నం ప్రభాకర్, శాట్‌జీ చైర్మన్ శివాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా చారిత్రక విజయం

- **2-0తో టెస్టు సిరీస్ కైవసం**
- **పాకిస్థాన్ ఓటమి పరిపూర్ణం**



రావల్పిండి: టెస్టులలో పాకిస్థాన్‌ను వారి సొంతగడ్డపై ఓడించాలన్న కలను బంగ్లాదేశ్ రెండు దశాబ్దాల తర్వాత నెరవేర్చుకుంది. రావల్పిండి వేదికగా జరిగిన రెండో టెస్టు ఐదో రోజు ఆటలో పర్యాటక జట్టు విజయానికి 143 పరుగులు (లక్ష్యం 185) అవసరం ఉండగా బంగ్లా బ్యాటర్లు 56 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చారిత్రాక విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇదే వేదికపై బంగ్లాదేశ్ తొలి టెస్టునూ గెలుచుకున్న విషయం విదితమే. 2001 నుంచి ఈ ఇరు జట్ల మధ్య టెస్టు మ్యాచ్‌లు జరుగుతుండగా పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ గెలవడం బంగ్లాకు ఇదే మొదటిసారి. 2021 తర్వాత టెస్టులలో గెలుపు మొహం వాచిన పాక్.. బంగ్లాతోనూ ఓడటంతో ఓటమిని పరిపూర్ణం చేసుకుంది. ఈ ఓటమితో టెస్టు ఆడే అన్ని దేశాలకూ సొంతగడ్డలో టెస్టు సిరీస్‌లు సమర్పించుకున్న రెండో జట్టుగా పాక్ (తొలిస్థానంలో బంగ్లా) నిలిచింది. బంగ్లాదేశ్‌కు విదేశాల్లో ఇది మూడో టెస్టు సిరీస్ విజయం కాగా పరాయిగడ్డపై 8వ టెస్టు గెలుపు.

# క్వార్టర్స్‌లో సిన్నర్ X మెద్వెదెవ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ), డేనియల్ మెద్వెదెవ్ (రష్యా) క్వార్టర్స్‌లో తలపడబోతున్నారు. పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో సిన్నర్.. 7-6 (7/3), 7-6 (7/5), 6-1తో టామీ పాల్ (అమెరికా)ను వరుస సెట్లలో ఓడించి క్వార్టర్స్‌కు చేరాడు. రెండు సెట్‌లు టైబ్రేకర్‌లకు దారితీసిన ఈ మ్యాచ్‌లో సిన్నర్ 10 ఏస్‌లు కొట్టగా పాల్ 4 మాత్రమే సాధించాడు. రెండు సెట్‌లలోనూ సిన్నర్‌తో నువ్వానేనా అన్నట్టుగా పోరాడిన పాల్.. మూడో సెట్‌లో మాత్రం చేతులెత్తేశాడు. సెమీస్ పోరు కోసం సిన్నర్, మెద్వెదెవ్ మధ్య బుధవారం ఆసక్తికర పోరు జరుగనుంది. పురుషుల డబుల్స్‌లో నిరాశపరిచిన భారత ఆటగాడు బోపన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో సుజియాదితో కలిసి సెమీస్ చేరాడు.

# వన్డే, టీ20ల్లోనూ 'బజ్‌బాల్'

## ఇంగ్లండ్ వైట్‌బాల్ కోచ్‌గా మెక్‌కల్లమ్

లండన్: 'బజ్‌బాల్' ఆటతో టెస్టులలో ఇంగ్లండ్ క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్న ఆ జట్టు హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ తన బాధ్యతలను పరిమిత ఓవర్లకూ విస్తరించనున్నాడు. ఇంగ్లండ్ వైట్‌బాల్ టీమ్స్‌కూ మెక్‌కల్లమ్‌ను హెడ్‌కోచ్‌గా నియమిస్తూ ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్ణయం తీసుకుంది. 2022లో ఇంగ్లండ్ టెస్టు జట్టుకు హెడ్‌కోచ్‌గా ఎంపికయ్యాక బెన్ స్టోక్స్ సారథ్యంలో అతడు ఇంగ్లిష్ క్రికెటర్ల ఆటతీరునే మార్చేశాడు. దూకుడే పరమావధిగా ఇంగ్లండ్‌తో ప్రత్యర్థులు టెస్టులు ఆడితే 'డ్రా' అనే ఆప్షన్‌ను మరిచిపోవాల్సిందే అన్నంత రేంజ్‌లో అతడు జట్టుకు మార్గనిర్దేశనం చేస్తున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌కూ పరిచయం చేసేందుకు బ్రెండన్ సిద్ధమయ్యాడు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.